TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్పూర్తి

సంపుటి : 1 | సంచిక : 46 | శుక్రవారం 10-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

### వికసిత్ భారత్ సరే ముందు

## ఆరోగ్య భారత్‌గా ఎదగాలి

### మైనే క్యాన్సర్ కో జీత్ లియా పుస్తకావిష్కరణలో కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** మన దేశం వికసిత్ భారత్‌కన్నా ముందూ ఆరోగ్య భారత్‌గా ఎదగాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు కేంద్రం నిరంతర కార్యాచరణ చేపడుతోందన్నారు. ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ పాల్కొండ విజయ్ ఆనంద్‌రెడ్డి రచించిన 'ఐ యామ్ ఎ క్యాన్సర్ సర్వైవర్' హిందీ అనువాదం 'మైనే క్యాన్సర్ కో జీత్ లియా' పుస్తకాన్ని గురువారం కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో క్యాన్సర్‌ను జయించిన 108 మంది విజయ గాథలను, వారి అనుభవాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ పట్ల ప్రజల్లో గల భయాందోళనలు, అపోహల తొలగింపునకు 30 ఏళ్లుగా వైద్యవృత్తిలో కొనసాగుతున్న డాక్టర్ పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి విశేష కృషి చేశారని కిషన్‌రెడ్డి అన్నారు.

## బీసీలకు కాంగ్రెస్, బీజేపీ వెన్నుపోటు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబరు 9:** చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టకుండా రాష్ట్రంలో కాంగ్రెస్.. బీసీ బిల్లును ఆమోదించకుండా కేంద్రంలోని బీజేపీ.. బీసీలకు వెన్నుపోటు పొడిచాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆ రెండు జాతీయ పార్టీలకు బీసీలపట్ల చిత్తశుద్ధి లేదని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జీవో న్యాయస్థానాల్లో నిలబడదని, కేవలం బీసీలకు మభ్యపెట్టేందుకు తీసుకుచ్చారని బీఆర్ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమయిందని స్పష్టం చేశారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చే సిన కాంగ్రెస్.. కులగణన నుంచి రిజర్వేషన్ల జీవో వరకు చేసిందంతా.. మోసమేనని అన్నారు. తన పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ప్రజా వ్యతిరేకతను చూసి రేవంత్‌రెడ్డి భయంతో వణికిపోతున్నారని, అందుకే స్థానిక ఎన్నికలను వివాదంగా మార్చి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పల్లెల్లో పాలన పడకేసి ప్రజలు అవస్థలు పడుతున్నారని, కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

## సుప్రీంకు వెళ్లే యోచనలో

# రేవంత్ సర్కారు

## స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టు స్టే

- రిజర్వేషన్లు ఇచ్చి తీరతామని స్పష్టం చేసిన మంత్రి శ్రీహరి
- బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై అడ్డుకుంటున్నాయని ఆరోపణ
- బీసీలు నిరాశ చెందవద్దని మంత్రి భరోసా





**తొవ్వ ,ప్రతినిధీ అక్టోబర్ 09:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్-9పై హైకోర్టు స్టే విధించడం తెలిసిందే. అయితే, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరతామని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుతో బీసీ వర్గాలు ఏమాత్రం నిరాశ చెందవద్దని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ అంశంపై న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీహరి మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఈ చారిత్రక నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. అయితే, ప్రతిపక్షాలు దీన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. "ఈ కేసు వేసింది బీఆర్ఎస్ పార్టీనే. బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకోవాలనే దురుద్దేశంతో బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ఈ కుట్రకు పాల్పడిరది" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తరఫున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించినప్పటికీ, స్టే రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తదుపరి అనుసరించబోయే వ్యూహంపై మంత్రి శ్రీహరి స్పష్టతనిచ్చారు. హైకోర్టు జారీ చేసిన తీర్పు పూర్తి కాపీ చేతికి అందిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తా మని తెలిపారు. న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం, హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయాలా లేదా ఇతర న్యాయపరమైన చర్యలు చేపట్టాలా అనే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. బీసీల సామాజిక న్యాయం కోసం ఎంతవరకైనా పోరాడతామని, ఈ రిజర్వేషన్ల అమలు తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు, జీవో-9పై హైకోర్టు స్టే విధించడం రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల్లో ఆందోళనను రేకెత్తించింది. ఈ పరిణామం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావడానికి కారణమవుతుందేమోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని సామాజిక న్యాయానికి సంబంధించిన అంశంగా భావిస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు మాత్రం ప్రభుత్వ నిర్ణయాన్ని మొదటి నుంచి విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి అడుగుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బొంతు చూపు

# కమలం వైపు...

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై బీజేపీలో కీలక పరిణామం
- బొంతు రామ్మోహన్ పేరు చర్చనీయాంశం



**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 09:**
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాజకీయ ఉత్కంఠకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ శిబిరంలో కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. పార్టీ నిర్వహించిన ఎన్నికల మేనేజ్‌మెంట్ సమావేశంలో అభ్యర్థి ఎంపికపై చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ అభ్యర్థిగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరును ప్రతిపాదించారు. రామ్మోహన్‌ను పార్టీలోకి ఆహ్వానించి, జూబ్లీహిల్స్ నుండి టికెట్ ఇవ్వాలని ఆయన స్పష్టంగా నాయకత్వానికి సూచించారు. అర్వింద్ మాట్లాడుతూ బొంతు రామ్మోహన్‌కు విద్యార్థి రాజకీయాల నుండి వస్తున్న బలమైన నేపథ్యం ఉందని, ముఖ్యంగా శ్రేణుల్లో ఆయనకు మద్దతు ఉన్నదని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనతో బీజేపీ అంతర్గతంగా చర్చలు మరింత చురుకుదనం సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్, సంస్థ ఇంచార్జ్ చంద్రశేఖర్ తివారి, ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెట్టేందుకు అవసరమైన వ్యూహరచనపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ఇక బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు ఇచ్చిన స్టేపై కూడా ఎంపీ అర్వింద్ స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీసీలపై ప్రేమ ఉందని చెప్పుకుంటూ, రాజ్యాంగపరమైన చర్యలు చేయకుండా రాజకీయ ప్రదర్శనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బిల్లులు చూపిస్తూ ప్రచారం చేయడం మాత్రమే పని కాదని, రాజ్యాంగ సవరణ లేకుండా రిజర్వేషన్లు ఎలా అమలవుతాయని ప్రశ్నించారు. బీసీల ఆత్మగౌరవం పాఠం చెప్పుకుంటూ చివరికి వారిని నమ్మకంలో ఉంచడం మాత్రమే లక్ష్యమని ఆయన మండిపడ్డారు. రాజకీయ పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, బీజేపీ బీసీ ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకునే దిశగా వ్యూహాలు రచిస్తోందని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఇప్పుడు కేవలం ఓట్లు గెలుచుకునే పోటీ కాకుండా, ప్రతిష్ట పరిరక్షణ సమరం రూపం దాల్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### తెలంగాణ ఉద్యానాభివృద్ధికి

# దిశానిర్దేశం

### ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక-2035' ఆవిష్కరణ



**తొవ్వ ,ప్రతినిధీ అక్టోబర్ 09:**
తెలంగాణ ఉద్యాన రంగ అభివృద్ధికి నూతన గమ్యం చూపించేందుకు రూపొందించిన లిలి'తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక-2035'లిలిను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర ఉద్యాన వికాసానికి దీర్ఘకాలిక వ్యూహరచనగా నిలిచే ఈ ప్రణాళికను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అర్భు కార్యక్రమంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డి. రాజిరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రణాళికలో భాగంగా రాబోయే ఐదు సంవత్సరాల్లో 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం పెంపు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు రూ. 921.40 కోట్లు సాగు పెట్టుబడిగా, రూ. 942.50 కోట్లు డ్రిప్ ఇరిగేషన్ కోసం కేటాయిస్తే ఒక్క రూపాయి పెట్టుబడికి నాలుగు రూపాయల లాభం పొందే అవకాశముందని ప్రణాళిక స్పష్టం చేసింది. ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన ఆధునిక రకాలు, సాంకేతికతలను విస్తృతంగా అమలు చేస్తే ఏటా రూ. 1,341 కోట్ల అదనపు ఉత్పత్తి విలువ సాధ్యమని అంచనా వేసింది. రాష్ట్రంలో మిగులు ఉత్పత్తి ఉన్న పంటలు, లోటు ఉత్పత్తి ఉన్న పంటలను వేరు చేసి, విస్తీర్ణ పెంపు, ఉత్పాదకత సాధన, పంట యాజమాన్యం, మార్కెటింగ్ వంటి అంశాలను సమగ్రంగా చేర్చి ఈ వ్యూహాత్మక పుస్తకాన్ని సిద్ధం చేశారు. ఈ ప్రణాళిక పుస్తకాన్ని డాక్టర్ డి. రాజి రెడ్డి, డాక్టర్ ఎ. భగవాన్, డాక్టర్ జి.పి. సునందిని సంయుక్తంగా రూపొందించారు. రాష్ట్ర ఉద్యాన రంగానికి ఈ ప్రణాళిక కీలక మలుపు కానుందనే నమ్మకం ప్రభుత్వ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి

## భారత్ యూకే భాగస్వామ్యం


# ప్రపంచ సుస్థిరతకు మూల స్తంభం

- ఇరుదేశాల మధ్య బంధం నమ్మకమైనది.. ప్రతిభ, సాంకేతికతతో ముందుకెళ్తోంది
- బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చల అనంతర ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం గొప్ప ముందడుగు: బ్రిటన్ ప్రధాని స్టార్మర్

**ముంబై, అక్టోబరు 9:** భారత్, యూకేలు సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇరు దేశాల మధ్య బంధాలు మరింత వృద్ధి చెంది.. ప్రపంచ సుస్థిరతకు, ఆర్థికాభివృద్ధికి మూల స్తంభంగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో గురువారం మోదీ భేటీ అయ్యారు. నేతలిద్దరూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. అనేక రంగాల్లో ఇరుదేశాల మధ్య బంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం స్టార్మర్, మోదీ మీడియాకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భారత్, యూకేల భాగస్వామ్యం అత్యంత నమ్మకమైంద ని.. ఇది ప్రతిభ, సాంకేతికతతో ముందుకు వెళ్తోందని మోదీ చెప్పారు. ఇరు దేశాల ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, తాను కలిసి పనిచేస్తామన్నారు. భారత్, యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాన్ని స్టార్మర్ గొప్ప ముందడుగుగా అభివర్ణించారు. ఈ ఒప్పందంతో సుంకాలు భారీగా తగ్గిపోతాయన్నారు. ఇరుదేశాల మార్కెట్లలో పరస్పర వాణిజ్యం పెరుగుతుందని, పెద్దఎత్తున ఉద్యోగావకాశాలూ లభిస్తాయని చెప్పారు. 2028 కల్లా ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ప్రధాని మోదీకి, ఆయన నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన అంశంపైనా తాము చర్చించినట్లు చెప్పారు. వివిధ రకాల లక్ష్యాలను ఛేదించగల తేలికపాటి క్షిపణి వ్యవస్థలను భారత సైన్యానికి సరఫరా చేయనున్నట్లు బ్రిటన్ అధికారులు చెప్పారు. అలాగే భారత నౌకాదళానికి అవసరమైన ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశాలపై ఇరుదేశాల మధ్య రూ.4151 కోట్ల ఒప్పందం జరిగినట్లు తెలిపారు.

**భారత్‌లో 9 వర్సిటీ క్యాంప్‌సలు**

భారత్‌లో కొత్తగా తొమ్మిది బ్రిటన్ యూనివర్సిటీల క్యాంప్‌సలను ఏర్పాటు చేయనున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. ఇటీవలే గురుగ్రామ్‌లో యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ క్యాంప్‌సను ప్రారంభించగా.. ఇప్పుడు యూనివర్సిటీ ఆఫ్ లాంకెస్టర్, యూనివర్సిటీ ఆఫ్ సర్రే క్యాంప్‌సలు కూడా ప్రారంభించనున్న ట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలో యూనివర్సిటీ ఆఫ్ యార్క్, అబెర్డీన్, బ్రిస్టల్, లివర్‌పూర్, క్వీన్స్ యూనివర్సిటీ బెల్‌ఫాస్ట్, యూనివర్సిటీ ఆఫ్ కొవెంట్రీలు క్యాంప్‌సలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో భారత్‌లో అత్యధిక ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పిన దేశంగా బ్రిటన్ నిలవనుందన్నారు. భారతదేశ అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. గురువారం ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో, సీఈవో ఫోరం సమావేశంలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. సాంకేతికత అంటే కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదన్నారు. అది సమానత్వానికి ప్రతీక అని చెప్పారు. భారత్ ఇతర దేశాలతో టెక్నాలజీని మాత్రమే పంచుకోవడం లేదని, దాన్ని అభివృద్ధి చేయడంలో సాయపడుతోందని చెప్పారు. యూకే సహా అంతర్జాతీయ పెట్టుబడిదారులందరినీ ఆహ్వానిస్తున్నామని.. భారత అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. కాగా, బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో భేటీ సందర్భంగా ప్రధాని మోదీ ఖలిస్థానీ తీవ్రవాదుల అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ప్రజాస్వామ్యాల్లో తీవ్రవాదం, హింసకు చోటు లేదని మోదీ స్పష్టం చేశారన్నారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్ విశేష ప్రజాదరణ పొందిన బాలీవుడ్ పాటను వింటున్న వీడియోను యశ్‌రాజ్ ఫిలిమ్స్ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. సూపర్ హిట్ సినిమా దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగేలోని 'తుజే దేఖా తో యే జానా సనమ్' పాటను స్టార్మర్ విన్నారు.



## స్థానిక ఎన్నికలు

# ఇజ్జత్ కా సవాల్

- స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న బండి సంజయ్
- తనకు గ్రూపులు లేవని వెల్లడి
- రాష్ట్ర నాయకత్వమే అభ్యర్థులను వెల్లడిస్తుందన్న సంజయ్

తొవ్వ ,ప్రతినిధీ అక్టోబర్ 09:
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సొంత పార్టీ నేతలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేయడంతో సమానమని, అంతకంటే నీచమైన పని మరొకటి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో ఈరోజు ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "నాకు ఎలాంటి గ్రూపులూ లేవు, బీజేపీయే నా గ్రూప్. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసమే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి" అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు తమ సొంత గ్రామాల్లో, మండలాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే వారికి గౌరవం, పలుకుబడి ఉంటాయని తేల్చిచెప్పారు. అభ్యర్థుల ఎంపికపై మాట్లాడుతూ, "గెలుపు అవకాశాలే ప్రామాణికంగా సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్ర నాయకత్వమే అభ్యర్థులను ప్రకటిస్తుంది. ఈ విషయంలో నా అభిప్రాయం మాత్రమే



అంతిమం కాదు" అని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, టిక్కెట్లు ఆశించే వారు నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వమే నిధులు అందిస్తోందని బండి సంజయ్ అన్నారు. "దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులిచ్చిన ఏకైక ఎంపీని నేనే. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలకు నయా పైసా ఇవ్వడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్ర నిధులను దారి మళ్లించి పల్లెలను నాశనం చేసింది" అని ఆయన ఆరోపించారు. అటువంటప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలకు ఏం ప్రయోజనం ఉంటుందని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటు అభ్యర్థించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# 22కి చేరిన చిన్నారుల మరణాలు

- మధ్యప్రదేశ్‌లో కల్తీ దగ్గు మందుతో తీవ్ర విషాదం
- మృతుల సంఖ్య 22కి చేరినట్లు అధికారిక ప్రకటన
- సిరప్‌లో విషపూరిత డ్కెథిలిన్ గ్లైకాల్ గుర్తింపు
- తమిళనాడుకు చెందిన ఫార్మా కంపెనీ యజమాని అరెస్ట్
- అధికారులపై వేటు వేసిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం



**తొవ్వ డెస్క్, అక్టోబర్ 09:** మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లాలో కల్తీ దగ్గు మందు సృష్టిస్తున్న విషాదం అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా మరో చిన్నారి చనిపోయాడు. దీంతో మృతుల సంఖ్య 22కు చేరింది. ఖాజ్రీ అంటు గ్రామానికి చెందిన అయిదేళ్ల మయాంక్ సూర్యవంశీ, నాగ్‌పూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. కిడ్నీలు పూర్తిగా విఫలం కావడమే మృతికి కారణమని వైద్యులు తెలిపారు. తమిళనాడుకు చెందిన శ్రీశన్ ఫార్మాస్యూటి కల్స్ తయారు చేసిన 'కోల్డ్రిఫ్' అనే దగ్గు మందు తాగడం వల్లే మయాంక్ మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ సిరప్‌లో ప్రమాదకరమైన పారిశ్రామిక రసాయనం డ్కెథిలిన్ గ్లైకాల్ (డీఈజీ) ఉన్నట్లు తేలింది. ఇది కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీసి, ప్రాణాలను హరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ దారుణ ఘటనపై మధ్యప్రదేశ్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. శ్రీశన్ ఫార్మా కంపెనీ యజమాని రంగనాథన్ గోవిందరాజన్‌ను చెన్నైలో అరెస్ట్ చేశారు. కాంచీపురంలోని మందుల తయారీ యూనిట్‌ను సీజ్ చేశారు. నిందితుడిని ఛింద్వాడాకు తరలించి విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

**మధ్యప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు**

ఈ ఘటనతో అప్రమత్తమైన మధ్యప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను, ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేసింది. రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌ను బదిలీ చేసింది. ఛింద్వాడా చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేశ్ గొన్నాడెను కూడా విధుల నుంచి తొలగించారు. మరోవైపు, నిర్లక్ష్యం ఆరోపణలతో వైద్యుడు ప్రవీణ్ సోనీని అరెస్ట్ చేయగా, దీనిని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆందోళనలకు పిలుపునిచ్చింది. సాధారణ జలుబు, దగ్గుతో బాధపడుతున్న పిల్లలకు ఈ సిరప్‌ను సూచించినట్లు తెలుస్తోంది. అయితే, ల్యాబ్ పరీక్షల్లో డీఈజీతో పాటు పారాసెటమాల్, క్లోర్‌ఫెనిరమైన్ వంటి నిషేధిత రసాయనాలు కూడా ఉన్నట్లు తేలింది. నాలుగేళ్లలోపు పిల్లలకు ఇలాంటి మందులను నిషేధిస్తూ 2023లోనే కేంద్రం ఆదేశాలు జారీ చేసినా, వాటి అమలులో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

# జైషే మహమ్మద్ సరికొత్త ఎత్తుగడ!

- జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ సరికొత్త నియామక వ్యూహం - విద్యావంతులైన ముస్లిం మహిళలే ప్రధాన లక్ష్యం
- మతపరమైన ప్రసంగాలతో భావోద్వేగాలను రెచ్చగొట్టి బ్రెయిన్‌వాష్ - వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా విస్తృతంగా ఉగ్ర ప్రచారం



**తొవ్వ ,డెస్క్ ,అక్టోబర్ 09:** పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ తన కార్యకలాపాలను విస్తరించేందుకు సరికొత్త, ప్రమాదకరమైన కుట్రకు తెరలేపింది. ఇప్పటివరకు యువకులనే లక్ష్యంగా చేసుకున్న ఈ సంస్థ.. తాజాగా విద్యావంతులైన ముస్లిం మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడిరచాయి. మతపరమైన ప్రసంగాలు, భావోద్వేగపూరిత సందేశాలతో వారిని బ్రెయిన్‌వాష్ చేసి తమ నెట్‌వర్క్‌లో చేర్చుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నట్లు గుర్తించాయి. జైషే మహమ్మద్‌కు అనుబంధంగా పనిచేసే 'జమాతుల్-ముమినాత్' అనే సంస్థ ఈ నియామకాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఈ సంస్థ 2004 నుంచే చురుకుగా ఉన్నప్పటికీ, ఇటీవల తన కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్, ఉత్తరప్రదేశ్, దక్షిణ భారతదేశంలోని పట్టణ ప్రాంతాల్లో నివసించే చదువుకున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంది. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు మదర్సాల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని చిన్న చిన్న గ్రూపులుగా ఏర్పడి ప్రచారం నిర్వహిస్తోంది. ఉర్దూ భాషలో ముద్రించిన ప్రచార సామగ్రిలో మక్కా, మదీనా చిత్రాలు, ఖురాన్‌లోని శ్లోకాలను వాడుతూ మహిళలను ఆకర్షిస్తున్నారు. "ఈ వ్యవస్థ అల్లాహ్ ఇచ్చింది", "ఈ వెలుగు ప్రపంచమంతా వ్యాపిస్తుంది" వంటి భావోద్వేగ నినాదాలతో వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. హిజాబ్ ధరించడం, ప్రార్థనలు చేయడం ద్వారానే మతానికి సేవ చేసినట్లు అవుతుందని నమ్మించి, వారిని ఉగ్ర కార్యకలాపాల వైపు మళ్లిస్తున్నట్లు తేలింది. గతంలో భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్, పంజాబ్ ప్రావిన్సులలో జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన తొమ్మిది ప్రధాన ఉగ్రవాద శిబిరాలను మన బలగాలు ధ్వంసం చేశాయి. ఈ దాడుల తర్వాత ఉగ్ర సంస్థలు తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి. భవిష్యత్తులో భారత్ నుంచి ఇలాంటి దాడులను ఊహించి, తమ స్థావరాలను పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని కఠినమైన, దుర్భేద్యమైన ప్రాంతాలకు రహస్యంగా తరలిస్తున్నాయని నిఘా వర్గాలు గుర్తించాయి.

# నేవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

- మెట్రోపాలిటన్ ప్రాంతానికి నూతన శ్వాస - ఆధునిక నిర్మాణ సౌందర్యం
- కనెక్టివిటీ, వాణిజ్యాభివృద్ధి - ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**తొవ్వ డెస్క్ అక్టోబర్ 09:** ముంబై : ముంబై మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి చరిత్రలో నేటి రోజు ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఘనంగా ప్రారంభించారు. ఈ మహత్తర ప్రాజెక్ట్ భారతదేశ పట్టణాభివృద్ధికి, ఆర్థిక పురోగతికి కొత్త దారులు తెరవనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ?19,650 కోట్ల భారీ వ్యయంతో 2,866 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ ఎయిర్‌పోర్ట్ కమలం ఆకారంలో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. భారత నిర్మాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ఆధునిక సాంకేతికతతో నిర్మించబడిన ఈ విమానాశ్రయం, దేశ ఆవిష్కరణ శక్తికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని పేర్కొన్నారు. నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ప్రారంభం ద్వారా ముంబై మెట్రోపాలిటన్ ప్రాంత కనెక్టివిటీ మరింత బలపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ముంబై, థానే, నవి ముంబై, రాయగడ్ ప్రాంతాలు వేగవంతమైన రవాణా సదుపాయాలు పొందనున్నాయని, పర్యాటక రంగానికి భారీ ఉత్సాహం లభించనుందని ఆయన అన్నారు. అంతర్జాతీయ పెట్టుబ డులు, వాణిజ్య అవకాశాలు విస్తరించనున్నాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో స్మార్ట్ సిటీ ప్రణాళికలు ఇప్పటికే రూపుదిద్దుకుం టున్నాయి. ఐటీ, పరిశ్రమ, గృహవసతి రంగాల్లో భారీ అభివృద్ధి జరుగనున్నట్లు అధికారులు వెల్లడిరచారు. ఆధునిక మెట్రో లైన్లు, బిజినెస్ జోన్లు, కార్పొరేట్ హబ్‌లు నిర్మాణ దశలోకి అడుగుపెడుతున్నాయని సమాచారం. ఈ ఎయిర్‌పోర్ట్ కేవలం రవాణా మౌలిక సదుపాయం మాత్రమే కాకుండా "న్యూ ఇండియా - మోడ్రన్ ఇండియా" దిశగా ముందడుగు వేస్తున్నదని ప్రధాని మోదీ హైలైట్ చేశారు. స్వదేశీ సాంకేతికతతో రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్ భారత్ ప్రపంచ స్థాయి మౌలిక వసతుల నిర్మాణంలో ముందంజలో ఉన్నదనే విషయాన్ని మరోసారి రుజువు చేస్తుందని ఆయన చెప్పారు. రెండో, మూడో దశలు పూర్తవగానే ఇది పశ్చిమ భారతదేశంలో అతిపెద్ద ఎయిర్ హబ్‌గా మారబోతోందని అధికారులు తెలిపారు. రోజుకు లక్షలాది ప్రయాణికులను సేవలందించే సామర్థ్యంతో దీనిని అభివృద్ధి చేస్తున్నారని వెల్లడిరచారు. సమగ్రంగా చూస్తే, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం ఒక రవాణా కేంద్రం కాదు, భారత స్వప్నాలకు ఓ రన్‌వే, ముంబై ప్రగతికి ఓ ఇంజిన్, ఆర్థిక అభివృద్ధికి ఓ గేట్‌వేగా నిలుస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.





# నేడు తెలంగాణ బంద్

**బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు నిర్ణయంతో..**

**టీఆర్పీ శ్రేణులకు తీన్మార్ మల్లన్న పిలుపు**



**తొవ్వ డెస్క్ ,అక్టోబర్ 09:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించడంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న స్పందించారు. కోర్టు తీర్పుపై రేపు తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చారు. బలహీనమైన జీవోతో బీసీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. రేపు తెలంగాణవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయాలని పార్టీ శ్రేణులకు తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే..

**ప్రభుత్వం నెక్స్ట్ ప్లాన్ ఇదేనా!**

**ప్లాన్ బి అమలు పై ఆలోచనలు**




**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 09:** స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే.. ప్రభుత్వం నెక్స్ట్ ప్లాన్ ఇదేనా!అంటే అవుననే అనుమానాలు తావిస్తున్నాయి.తెలంగాణలో గురువారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. కాగా బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణగా జరగగా.. స్థానిక ఎన్నికలపై స్టే విధించింది. దీంతో ఈ ఎన్నికలు వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కార్ ప్లాన్ బీ అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికలు ఆగకుండా పాత రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముందుకు వెళ్తుందని సమాచారం బలంగా వినిపిస్తుంది దానికి అనుగుణంగా నేడు క్యాబినెట్ సమావేశం వుండే అవకాశం వుంది.

# గ్రూప్-1 సమస్యపై కవిత దూకుడు

**- ప్రభుత్వానికి సవాల్**



**హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రూప్-1 నియామకాల్లో జరిగిన అవకతవకలను బహిర్గతం చేస్తూ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇక మౌనంగా ఉండబోమని స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గ్రూప్-1 అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల ఆశలు నిండా నిండా ఉన్న ఈ పరీక్షను ప్రభుత్వం నిర్లక్ష్యంగా తీసుకువెళ్లిందని ఆమె ఆరోపించారు. "రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1 నియామకాలు ప్రారంభం నుంచి ముగింపు దశ వరకు తప్పులతో నిండి ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేదు. అభ్యర్థులు ఎదురుచూస్తున్న సమాధానాలు ప్రభుత్వం వద్ద లేవు" అని కవిత విమర్శించారు. ఈ నెల 15న హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇవ్వబోతోందని గుర్తుచేస్తూ, ఆ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు ఆపకుండా కొనసాగిస్తామని ఆమె తెలిపారు. "విద్యార్థి అమరవీరుల సాక్షిగా మా పోరాటం ప్రారంభమైంది. ఇక వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని ఆమె హితవు పలికారు. ప్రస్తుతం కొనసాగుతున్న నియామక ప్రక్రియను రద్దు చేసి, కొత్తగా పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా నుండి గవర్నర్ కార్యాలయం వరకు అన్ని వేదికల్లో ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆమె వివరించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని గవర్నర్, ముఖ్యమంత్రికి ప్రత్యక్షంగా అందజేస్తామని తెలిపారు. "తెలంగాణ విద్యార్థులపై అన్యాయానికి జాగృతి సంస్థ నిశ్శబ్దంగా ఉండదు. ప్రతి అభ్యర్థి వెనుక మేముంటాం. పోరాటం న్యాయంగా సాగుతుంది కానీ ఆగదు" అని కవిత స్పష్టం చేశారు.

# ప్రతి రోడ్డు ప్రమాద మరణంపై విశ్లేషణ

**స్టేషన్ ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లాలి**

**మరో ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలి: డీజీపీ శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 9:** రాష్ట్రంలో ఏటా దాదాపు 900 హత్య కేసులు నమోదవుతుంటే.. అంతకు తొమ్మిది రెట్లు ఎక్కువగా 8,000 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని డీజీపీ శివధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న రోడ్డు ప్రమాద కేసుల విషయంలో పోలీసులు కొత్త మార్గం అనుసరించాలని చెప్పారు. ఆయా స్టేషన్ల ఉన్నతాధికారులు ఘటన స్థలానికి వెళ్లాలని, ఆ ప్రమాదం ఎలా జరిగింది? మరణం సంభవించడానికి కారణాలేమిటి? ఎలాంటి చర్యల ద్వారా మరో ప్రాణం పోకుండా చూడవచ్చనే విశ్లేషణ చేపట్టాలని సూచించారు. నైట్ పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అవగాహనా కార్యక్రమాల నిర్వహణ, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంలో ప్రతి పోలీసు అధికారి నిజాయితీగా కృషి చేయాలని కోరారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గురువారం వివిధ జిల్లాల ఎస్పీలు, రేంజ్ డీఐజీలు, ఐజీలు, కమిషనర్లు, సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించి, పోలీసులకు కీలక సూచనలు చేశారు. న్యాయమైన, దృఢమైన, స్నేహపూర్వక, వృత్తిపరమైన పోలీసింగ్‌ను అనుసరించాలని పేర్కొన్నారు.

# అది ముగిసిపోయిన అధ్యాయం

**- సీజేఐ జస్టిస్ గవాయ్ - న్యాయవాది షూతో దాడికి యత్నం - జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందన**

**తొవ్వ డెస్క్ ,అక్టోబర్ 09:**
సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇప్పుడు ఆ ఘటనపై జస్టిస్ బీఆర్ గవాయ్ మరోసారి మాట్లాడారు. న్యాయవాది తనపై షూ విసిరేందుకు ప్రయత్నించినప్పుడు తాను, జస్టిస్ కె వినోద్ చంద్రన్ షాక్ అయ్యామని తెలిపారు. కానీ ఆ విషయం ముగిసిపోయిన అధ్యాయమని చెప్పారు. ఈ మేరకు వనశక్తి తీర్పును సమీక్షించాలని, సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ గురువారం పలు వ్యాఖ్యలు చేశారు."సోమవారం జరిగిన దానితో నా సోదరుడు (జస్టిస్ చంద్రన్), నేను చాలా షాక్ అయ్యాం. మాకు ఇది ముగిసిపోయిన అధ్యాయం" అని షూ దాడిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడారు. అయితే దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై చర్యలు తీసుకున్న ధర్మాసనంలో భాగమైన జస్టిస్ ఉజ్జల్ భుయాన్ కూడా పలు వ్యాఖ్యలు చేశారు. దానిపై తనకు సొంత అభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. ఆయన ఇది జోక్ విషయం కాదని చెప్పారు. షూ దాడి సుప్రీం కోర్టుకు అవమానమని, తగిన చర్య తీసుకోవాలని జస్టిస్ భుయాన్ కోరారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయవాది చర్యను క్షమించరానిదిగా అభివర్ణించారు. మరోవైపు, న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ చర్యలు ప్రారంభించింది. రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతోపాటు న్యాయస్థానం ప్రాంగణంలోకి కూడా ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని



గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడిరచింది. ఇలాంటి అస్థిరమైన ప్రవర్తన కోర్టు అధికారికి పూర్తిగా తగదని తెలిపింది. వృత్తిపరమైన నీతిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది.

**పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడి!**

సుప్రీంకోర్టు గౌరవాన్ని కూడా కాలరాయడమేనని తెలిపింది. న్యాయవాది రాకేశ్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. కాగా ఘటన నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రాకేశ్ కిశోర్ లాయర్ ల్కెసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

# రన్‌వే నుంచి జారిన ప్రైవేట్ విమానం

**తప్పిన పెను ప్రమాదం**




**తొవ్వ .అక్టోబర్ 09**
లక్నో: టేకాఫ్ అవుతున్న ప్రైవేట్ విమానం రన్ వే నుంచి జారింది. రన్ వే పక్కన్న ఉన్న గడ్డిలోకి అది దూసుకెళ్లింది. ఆ ప్రైవేట్ విమానంలో ఉన్న ప్రముఖులకు ప్రమాదం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో జెట్ సర్వ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వీటీ డే జెట్ విమానం మొహమ్మదాబాద్ ఎయిర్‌స్ట్రిప్ నుంచి బోఫాల్‌కు బయలుదేరింది. అయితే టేకాఫ్ అయిన వెంటనే ఆ విమానం అదుపుతప్పింది. రన్ వే నుంచి సుమారు 400 మీటర్లు జారింది. పక్కనే ఉన్న గడ్డి ప్రాంతంలోకి దూసుకెళ్లి ఆగింది. కాగా, వుడ్‌పెకర్ గ్రీనాగ్రి న్యూట్రియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన డిప్యూటీ మేనేజింగ్ డ్కెరెక్టర్ అజయ్ అరోరా, ఎస్‌బీఐ హెడ్ సుమిత్ శర్మ, బీపీవో రాకేష్ వంటి ప్రముఖులు ఈ ప్రైవేట్ జెట్ విమానంలో ఉన్నారు. అయితే ప్రమాదం తప్పడంతో వారంతా సురక్షితంగా బయటపడ్డారు. మరోవైపు కెప్టెన్ నసీబ్ బమల్, కెప్టెన్ ప్రతీక్ ఫెర్నాండెజ్ నిర్లక్ష్యం వల్ల ఈ సంఘటన జరిగినట్లు ఆ ఫుడ్ కంపెనీ అధికారి ఆరోపించారు. విమానం ట్కెర్లలో తక్కువగాలి పీడనం ఉన్నట్లు పైలట్లకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు ఆ ప్రైవేట్ విమానం వద్దకు చేరుకున్నారు. టేకాఫ్ సమయంలో రన్‌వే నుంచి జారడంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# 51 మంది అభ్యర్థులతో ప్రశాంత్ కిషోర్ పార్టీ తొలి జాబితా

**తొవ్వ డెస్క్ ,అక్టోబర్ 09:**
పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ 51 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. పాఠ్యపుస్తకాలు రాసిన గణిత శాస్త్రజ్ఞుడు, రిట్కెర్డ్ పోలీసు అధికారి, వైద్యుడు, మాజీ అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. అవినీతిపై గళమెత్తిన ప్రశాంత్ కిషోర్, క్లీన్ ఇమేజ్ ఉన్న అభ్యర్థుల ఎంపికపై దృష్టిసారించారు. తొలి జాబితా అభ్యర్థుల్లో 17 శాతం బీసీలు, 16 శాతం ముస్లిం అభ్యర్థులున్నారు. కాగా, ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు కేసీ సిన్హా, కుమ్రార్ స్థానం నుంచి జన్ సురాజ్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గతంలో పాట్నా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ఆయన రాసిన పాఠ్యపుస్తకాలు బీహార్‌తోపాటు పలు రాష్ట్రాల్లో పాపులర్ అయ్యాయి. పాట్నా హైకోర్టులో సీనియర్ న్యాయవాది వైబీ గిరి, బీహార్ అదనపు అడ్వకేట్ జనరల్‌గాను, పాట్నా హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ కేసులకు అదనపు సొలిసిటర్ జనరల్‌గా కూడా పనిచేశారు. మాంఠీ%ఖ% స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ పూర్వ విద్యార్థి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలకు కృషి చేసిన డాక్టర్ అమిత్ కుమార్ దాస్, ముజఫర్‌పూర్ స్థానం నుంచి



ఎన్నికల బరిలో నిలిచారు. మరోవైపు రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ పేరు తొలి జాబితాలో లేదు. అయితే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే స్పష్టం చేశారు. ఆర్జేడీ బలమైన స్థానం, తేజస్వీ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాఘోపూర్ నుంచి ఆయన పోటీ చేయవచ్చని తెలుస్తున్నది.

# డ్వాక్రా డబ్బులు మాయం..

**పురుగుల మందు డబ్బాలతో మహిళల నిరసన**



**తొవ్వ వేములవాడ,అక్టోబర్ 09**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో మహిళా సంఘం సభ్యులు నిరసనకు దిగారు. సభ్యుల నుంచి వసూలు చేసిన 5 లక్షల 26 వేల రూపాయలు యూనియన్ బ్యాంకులో జమ చేయకుండా చేతివాటం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం బ్యాంకు ముందు పురుగుల మందు డబ్బాతో ధర్నాకు దిగారు. ఈ సం దర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ వేములవాడ మండలం కొనాయిపెల్లి లోని సాయిబాబా మహిళా సంఘం సభ్యుల నుంచి యూనియన్ బ్యాంకు కర స్పాండెంట్ జ్యోతి 5 లక్షల 26 వేలు వసూల్ చేసి, రెండు లక్షల 70 వేల రూపాయలు మాత్రమే బ్యాంకులో జమ చేసిందన్నారు. మిగతా 2 లక్షలు 56 వేల రూపాయలతో తనకు సంబంధం లేదంటుందని మండిపడ్డారు. తాము కట్టిన డబ్బులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ మేనేజర్ సంఘం సభ్యులతో మాట్లాడుతూ బ్యాంకు కరస్పాండెంట్ జ్యోతి నుంచి డబ్బులను రికవరీ చేసి ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## నాలుగేళ్లుగా గవర్నర్‌తో ప్రభుత్వ పోరాటం

**- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి**



**తొవ్వ డెస్క్ ,అక్టోబర్ 09:**
చెన్నై: నాలుగేళ్లుగా గవర్నర్‌తో రాష్ట్ర ప్రభుత్వం పోరాడుతూనే ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన తిరుచ్చి శ్రీరంగం శాసనసభ నియోజకవర్గ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారం ప్రారంభించాయన్నారు. అయితే ఒక్కరు మాత్రం రెండు రోజుల క్రితం ప్రచారం చేపట్టారని, ఆయన మరెవరో కాదు, రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి అని అన్నారు. తమిళనాడు పోరాడుం, తమిళనాడు వెల్లుం' అని మనం చెబుతుంటే, 'నీంగళ్ యారుడన్ పోరాడ పోగిరీర్‌గళ్ యారై వెల్ల పోగీర్‌గళ్' అంటూ గవర్నర్ ప్రశ్నిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌తో పోరాడుతూనే ఉందని, తప్పకుండా తమిళనాడు పోరాడి గెలుస్తుందన్నారు. ఎడప్పాడి పళనిస్వామి లాగే ముఖ్యమంత్రి కూడా అణిగిమణిగి ఉంటారని గవర్నర్ భావిస్తున్నారని, అయితే ఆ ఆశలు నెరవేరబోవన్నారు. రాష్ట్రంలో డీఎంకే ఉన్నంత వరకు అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతుందని, ఫాసిస్ట్ శక్తులను ఎన్నడూ అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.రానున్న ఎన్నికల్లో 200సీట్లు గెలుపే లక్ష్యంగా పార్టీ నేత లు, కార్యకర్తలు కృషిచేయాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు.

## కుబేరుల జాబితాలో ముకేశ్ నంబర్-1

**తొవ్వ.అక్టోబర్ 09:**



రిలయన్స్ ఇండస్ట్రీస్ చ్కెర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసిన భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ ఫస్ట్ ప్లేస్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 105 బిలియన్ డాలర్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ముకేశ్ సంపద 12 శాతం క్షీణించింది. ఇక ముకేశ్ అంబానీ తర్వాత 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో ఉన్నారు. జిందాల్‌కు చెందిన సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో, టెలికం దిగ్గజం సునీల్ మిట్టల్ 34 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, టెక్ బిలియనీర్ శివ నాడార్ 33 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచారు. 2025 ఫోర్బ్స్ జాబితాలో 100 మంది దేశీయ కుబేరుల సంపద విలువ 9 శాతం (100 బిలియన్ డాలర్లు) పడిపోయి 1 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇందుకు పలు కారణాలు ఉన్నట్లు ఫోర్బ్స్ నివేదించింది.

## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై కీలక సమీక్ష

**- త్వరితగతిన పనులు ప్రారంభించాలన్న**

**మంత్రి కొమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు**




డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొమటి రెడ్డి వెంకట్ రెడ్డి కలిసి హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించబడిరది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో మాట్లాడిన అధికారులు, మంత్రివర్యులు హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులను దశలవారీగా, సమయపాలనతో వేగంగా ప్రారంభించాలనే ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టుల ప్రణాళిక నుండి అమలు వరకు పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు నేరుగా ఉపయోగకరంగా ఉండే మార్గాలను గుర్తించి ముందుగా పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సమగ్రమైన ప్రాతినిధ్యం కల్పిస్తూ రోడ్ల ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అభివృద్ధి ఒక్క ప్రాంతానికే పరిమితమవకుండా సమతౌల్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ క్రమంలో ట్రాఫిక్ సర్వే నివేదికలను పరిగణనలోకి తీసుకోవడం అత్యంత కీలకమని సమావేశంలో పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు అత్యవసరంగా అవసరమైన మార్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా రోడ్ల నిర్మాణం కేవలం అభివృద్ధి కార్యక్రమం కాక ప్రజావసర సేవగా నిలవాలని నొక్కిచెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి, నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణానికి కట్టుబడి ఉండాలని మంత్రివర్యులు సూచించిన సందర్భంగా, సమావేశం నిర్మాణాత్మక చర్చలతో కొనసాగింది.

# హైదరాబాద్‌లో ఎపిడ్రిన్ డ్రగ్స్ తయారీ

**- అపార్ట్ మెంట్ ఫ్లాట్ లో ఈగల్ టీమ్ సోదాలు - రూ.70కోట్ల 220 కేజీల సరుకు స్వాధీనం**

**- నలుగురు అరెస్టు, పరారీలో మరొకరు - ఐడీఏ బొల్లారంలోని కంపెనీ సీజ్**





**తొవ్వ హైదరాబాద్ .అక్టోబర్ 09:**
హైదరా బాద్ మహా నగరంలో మరోసారి మాదక ద్రవ్యాల తయారీ స్థావరాన్ని ఈగిల్ టీమ్ గుర్తించింది. జీడిమెట్ల ప్రాంతంలోని ఓ అపార్ట్మెంట్ ఫ్లాట్ నుంచి అంతర్జాతీయ మార్కెట్లో రూ.70 కోట్లు విలువ చేసే 220 కేజీల ఎపిడ్రిన్ డ్రగ్స్ను స్వాధీనం చేసుకుంది. నలుగురిని అరెస్టు చేసింది. ఈగల్ అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కాకినాడ ప్రాంతానికి చెందిన శివరామక్రి ష్ణవర్మ హైదరాబాద్కు వలస వచ్చి జీడిమెట్ల స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి ఐడీఏ బొల్లారంలోని పీఎన్ఎం లైఫ్సైన్స్ కంపెనీకి చెందిన అనిల్ పరిచయమయ్యాడు. అతడి ద్వారాతయారుచేసేందుకు స్కెచ్ వేశాడు. దీనికి భారీగా నగదును ఇస్తానని అనిల్కు హామీ ఇవ్వడంతో కంపెనీ డైరెక్టర్లు మద్దు వెంకటక్రిష్ణారావు, ఎం.ప్ర. సాద్, విఘ్నసాయి ల్యాబొరేటరీ ప్రొడక్షన్ అపరేటర్ దొరబాబుతో కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసు కున్నారు. శివరామక్రిష్ణవర్మ ఎపిడ్రిన్ తయారు చేయడానికి అనిల్ అండ్ టీంకు ఒక ఫార్ములాను ఇచ్చి అందుకు అవసరమైన ముడిసరుకులను అందించాడు. ఖర్చులకు రూ.8లక్షల నగదు ఇచ్చాడు. వీటితో %u=ఖూ% ఫార్ములా ఆధారంగా మూడు స్థాయిలో ముడిసరుకులను మిక్సింగ్ చేసి చివరకు ఎపిడ్రిన్ డ్రగ్స్ను పీఎన్ఎం లైఫ్సైన్స్ కంపెనీలో తయారు చేశారు. 220 కేజీల ఎపిడ్రిన్ డ్రగ్ను జీడి మెట్లలోని తన ఫ్లాట్లో దాచిపెట్టాడు. వీటిని కొనుగోలు చేసే వారి కోసం శివరామక్రిష్ణ గాలిస్తు న్నాడు. గతంలో కూడా 250 కేజీల అంఫెటామైన్, బెంగళూరు, హైదరాబాద్ ఎన్సీబీ అధికారులకు 10 కేజీల అలాజోలమ్ విక్రయిస్తుండగ దొరికారు.ఈ నేపథ్యంలో అతని కదలికలపై ఈగల్ దృష్టి పెట్టడంతో ఇవాళ అతడి ఫ్లాట్లో సోదాలు చేసి 220 కేజీల ఎపిడ్రిన్ డ్రగ్స్ను స్వాధీనం చేసుకు న్నారు. ఈ కేసులో శివరామక్రిష్ణతో పాటు అనిల్, దొరబాబు, వెంకటక్రిష్ణారావులను అరెస్టు చేయగా మరో నిందితుడు ప్రసాద్ పరారీలో ఉన్నాడని అధి కారులు తెలిపారు. ఈ మేరకు పీఎన్ఎం లైఫ్సైన్స్ కంపెనీని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

# నిరుద్యోగుల పాలిట బతుకమ్మగా కవితక్క

**గ్రూప్ -1 నియామకాల్లో అవకతవకలపై రౌండ్ టేబుల్ సమావేశంలో నిరుద్యోగుల ఆవేదన**

**నియామకాలు తీసుకున్నవారి గుండెల్లో గుబులు**

**గ్రూప్ 1 నియామకాల రద్దుకోసం ఉద్యమ కార్యాచరణ ..**

**జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం**






**తొవ్వ , డెస్క్ అక్టోబర్ 09:**
నిరుద్యోగుల పాలిట బతుకమ్మ గా కవితక్క నిలబడి వారికీ మద్దతు అందించడం నిజంగా శుభ పరిణామం అని పలు నిరుద్యోగులు పరీక్షా కేంద్ర నిర్వహాకులు అన్నారు , గురువారం గ్రూప్ -1 నియామకాల్లో అవకతవకలపై జాగృతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంనిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ నిరుద్యోగుల ఆవేదన ఉసురు ఈ ప్రభుత్వానికి తప్పకుండ తాకుతుందని , గ్రూప్-1 విషయంలో ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు చాలా కార్యక్రమాలు చేయనున్నాం. 15 తారీఖున డివిజన్ బెంచ్ తీర్పుపై విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని . అందుకే 15తర్వాత కార్యక్రమాలు తీసుకుందామని నిర్ణయించాం అన్నారు . బుధవారం విద్యార్థి అమరవీరులకు నివాళులు అర్పించి వారి సాక్షిగా పోరాటం ప్రారంభించాంఅని . ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపేందుకే రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశాం.అన్నారు గ్రూప్ -1 విషయంలో నోటిఫికేషన్ నాటి నుంచి రిజల్ట్స్ వరకు అడుగడుగునా తప్పులు జరిగాయని ఆ తప్పులను నేను మండలిలో కూడా ఎత్తి చూపాను. అయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంద న్నారు. ప్రభుత్వం చేసిన తప్పులను ఎండగట్టటంలో మీడియా, సోషల్ మీడియా చాలా సహకరిస్తోంది. సమావేశంలో వ్యక్త కూరపాటి శ్రీను మాట్లాడుతూ 563 మంది అభ్యర్థుల కోసం మేము పోరాడుతున్నాంమని అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంటేనే కదా మేము మాట్లాడతున్నాం. అంగవైకల్యం ఉన్న వారికి ఉన్న చిత్తశుద్ధి కూడా టీజీపీఎస్సీకి లేదన్నారు . అసలు హాల్ టికెట్ పక్కనే పేర్లు ఇవ్వటానికి సమస్య ఏంటీ? దీనికి కూడా ఆర్టీఐ అప్లికేషన్ వేయాలా? దీనికి ఆధారాలు ఏవీ అని కాంగ్రెస్ నాయకులు అడుగుతున్నారు. విద్యార్థులకు రావాల్సిన ఉద్యోగాలను అమ్ముకున్నారు. వీటిపై నిగ్గు తేల్చాల్సిన అవసరముందన్నారు నిరుద్యోగి ఉద్యోగం విషయంలో కోర్టు కేసు వేయాలంటే ఆర్థికంగా విద్యార్థులకు సాధ్యం కాదని రాజకీయ పార్టీలు నిరుద్యోగుల తరపున లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని కోరుతుమాన్నారు విద్యార్థి మంజుల, మాట్లాడుతూ ప్రిలిమ్స్ హాల్ టికెట్ పైనే ఓసీ అని రాసారని అంటే మెరిట్ పైనే జాబ్ %ొ%కదా అని ప్రశ్నించారు డాక్టర్ నాగేందర్ ఇప్పుడున్న ప్రభుత్వం కేవలం నొటిఫికేషన్ మాత్రమే ఇచ్చింది. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ కు రిజల్ట్స్ మాత్రమే ఇచ్చారు. మేము కాంగ్రెస్ ను గెలిపిస్తే మాకు న్యాయం చేయలేదు. ఫైనల్ రిజల్ట్ లో మెయిన్స్ మార్కులతో పాటు ప్రిలిమ్స్ మార్కులు కూడా ఇస్తామన్నారు. దీని వల్ల మెయిన్స్ ఎవరు రాశారో తేలిపోతుంది. కానీ వాళ్లు మార్కులు ఇవ్వలేదు. ట్రాన్స్ ఫరెన్సీ గురించి టీజీపీఎస్సీ చాలా చెబుతుంది. 30 తారీఖు నాడు మార్కులు ఇస్తే 22 తారీఖు నాడే 618 మందికి 450 కి పైగా మార్కులు వస్తాయని టీజీపీఎస్సీ ముచ్చట్లు అనే గ్రూప్ లో పెట్టారు. రిజల్ట్ ముందుగానే వారికి ఎలా తెలిసింది. 110 మంది ర్యాంకర్లు పక్క పక్కన, ఎదురెదురుగా ఉన్నారు. అది ఎలా సాధ్యం?అన్నారు 2022 లో వచ్చిన ఒక ఎడిటోరియల్ ప్రశ్నగా ఎలా వచ్చింది? అశోక్ మాట్లాడుతూ ఈ రోజు జరిగినా ప్రొగ్రామ్ తో ఉద్యోగాలు తీసుకున్న వాళ్లలో భయం స్టార్ట్ అవుతుందని . ఎందుకంటే ఇది ఎటు పోతుందోనని వారికి భయం అవుతుంది. గతంలో విద్యార్థులు పెట్టిన సమావేశాలు పూర్తిగా సక్సెస్ కాలేదు. కానీ ఇవ్వాళ్టి సమావేశం సక్సెస్ కావటంతో ఉద్యోగాలు వచ్చిన వాళ్లలో భయం స్టార్ట్ అవుతదన్నారు గ్రూప్ -1 కోసం పోరాటం చేస్తున్న వాళ్లలో ఆశలు చిగురిస్తాయి. కవిత గారిని అందరూ అక్క అంటారు. తెలంగాణ బతుకమ్మ అంటారు. వారు తెలంగాణ నిరుద్యోగులకు కూడా బతుకమ్మగా మారాలని విజ్ఞప్తి చేస్తున్నా. నిరుద్యోగులు స్ట్రీట్ ఫైట్ మాత్రమే చేయగలరు. లీగల్ గా ఫైట్ చేసేంత ఆర్థిక స్థోమత వారికి లేదు. వారి లీగల్ ఫైట్ కు మద్దతుగా కవిత రావాలని కోరుతున్నాట్టు తెలిపారు . 563 ఉద్యోగాల్లో అసలు రేవంత్ రెడ్డి వాటా ఎంత %ొ%అని ప్రశ్నించారు ,నిరుద్యోగ యువతకు మద్దతుగా జాగృతి ముందుంటున్నదన్నారు ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు నిరుద్యోగ యువత ,సంఘాల నాయకులు పాల్గొన్నారు




# జీవో 9పై హైకోర్టు జోక్యం

**- ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్**

**- 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై న్యాయపోరాటం మొదల్కెంది**

**- సామాజిక న్యాయమా రాజకీయ లాభాలా? రిజర్వేషన్ వివాదంపై రాష్ట్ర చర్చ**

**- ఆరు వారాలకు విచారణ వాయిదా**

**- అభ్యర్థులు, పార్టీలకు అనిశ్చితి**



తొవ్వ ,ప్రతినిధీ అక్టోబర్ 09:
తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన వేళ, బీసీ రిజర్వేషన్ల అంశం మరోసారి ప్రధాన చర్చగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కొర్టు జోక్యం చేసుకోవడం రాజకీయ వర్గాల్లో కొత్త చర్చలకు దారి తీసింది. రెండు రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం, రిజర్వేషన్ల అంశంపై తాత్కాలికంగా ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సూచిస్తూ, తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన రోజునే స్టే విధించడంతో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జడ్పీటీలతో పాటు కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ కూడా నిలిచిపోయే అవకాశం స్పష్టమవుతోంది. బీసీ రిజర్వేషన్ల పెంపు సామాజిక న్యాయం దిశగా తీసుకున్న అడుగని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. బీసీ వర్గాలు ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న న్యాయాన్ని ప్రభుత్వం అందించాలని ప్రయత్నిస్తోందని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. అయితే ప్రతిపక్షాలు మాత్రం దీనిని పూర్తిగా రాజకీయ లాభాల కోసం తీసుకున్న నిర్ణయంగా ప్రచారం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాల్లో ఉన్న పార్టీలకు ఈ స్టే అనుకోని విధంగా బ్రేక్ వేసింది. ఇప్పటికే జిల్లా స్థాయిలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమై ఉండగా, హైకోర్టు ఉత్తర్వులతో పరిస్థితి క్లిష్టంగా మారింది. బీసీ సంఘాలు, సమాజ ప్రతినిధులు కోర్టు తీర్పును జాగ్రత్తగా పరిశీలిస్తూ, తమ వాదనలు ప్రభుత్వానికి తెలియజేయాలని సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రభుత్వ వర్గాలు ఈ వ్యవహారంపై న్యాయపరమైన దృక్కోణంలో సమగ్రంగా స్పందించేందుకు సన్నాహాలు ప్రారంభించాయి.రాష్ట్ర రాజకీయాల్లో బీసీ ఓటు బ్యాంక్ ఎప్పుడూ కీలక పాత్ర పోషించిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ రిజర్వేషన్ వివాదం వచ్చే రోజుల్లో మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. రిజర్వేషన్ల అమలుపై తుది తీర్పు వచ్చే వరకు ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయి, రాజకీయ నేతల పర్యటనలు, సమావేశాలు, బహిరంగ సభలు ఇప్పుడు కొత్త దిశగా మలుపు తిరిగే అవకాశముంది.

# తెలంగాణ రైతులకు ఉపశమనం

**మొక్కజొన్న కొనుగోలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే**

**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 09:**



తెలంగాణ రైతులకు ఊరట కలిగించే నిర్ణయం వెలువడిరది. రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించిన ప్రకారం, మొక్కజొన్న పంటను మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ నిర్ణయం గురువారం సీఎం రేవంత్ రెడ్డితో జరిగిన సుదీర్ఘ చర్చల తరువాత తీసుకున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధరను ప్రకటించినప్పటికీ, కొనుగోలు ప్రక్రియలో పాల్గొనే ఆసక్తి చూపలేదని మంత్రి అన్నారు. దీంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా పంట సేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే 535 కోట్ల రూపాయలు వెచ్చించి రైతుల నుండి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసిందని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగినట్లు మంత్రి వివరించారు. సగటున ఎకరాకు 18.50 క్వింట్ల దిగుబడితో మొత్తం 11.56 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయబడిరది. ఈ పంటకాలంలో 8.66 లక్షల మెట్రిక్ టన్నుల పంటను ప్రభుత్వ కొనుగోలు సంస్థల ద్వారా సేకరించాలనే ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడిరచారు. సెప్టెంబర్ మూడవ వారంనుంచి మార్కెట్లో మొక్కజొన్న అధిక పరిమాణంలోకి రావడంతో ధరలు పడిపోయాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింట్లకు రూ.1,959 మాత్రమే లభిస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అయిన రూ.2,400 కన్నా రూ.441 తక్కువ. దీంతో రైతులు ఆర్థిక నష్టంతో సతమతమవుతున్నారని మంత్రి పేర్కొన్నారు. మొత్తం 8.66 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరణకు సుమారు రూ.2,400 కోట్ల వ్యయం అవుతుందని, అయినప్పటికీ రైతులు నష్టపోవకుండా ప్రతి క్వింట్‌కు పూర్తి మద్దతు ధర చెల్లించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు తమ పండిరచిన పంటను సమీపంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, అక్కడే మద్దతు ధర ఆధారంగా చెల్లింపులు జరుగుతాయని వ్యవసాయ శాఖ సూచించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని వేలాదిమంది మొక్కజొన్న రైతులకు ఆర్థిక ఊరట లభించనుంది.



# అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

# నా హృదయాన్నే దోచావే..



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. 'థ్రిల్-యు ప్రాప్తిరస్తు' ఉపశీర్షిక. రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వి నారంగ్ నిర్మిస్తున్నారు. సుమ కనకాల కీలక పాత్రధారి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి 'దోచావే నన్నే' అనే పాటను హీరో నాని విడుదల చేశారు. లియోన్‌జేమ్స్ స్వరపరచిన ఈ పాటను శ్రీమణి రచించారు. మెలోడీ ప్రధానంగా సాగిన ఈ పాట ప్రేమలోని హృద్యమైన భావాలను ఆవిష్కరిస్తూ సాగింది. ప్రియదర్శి, ఆనంది జోడీ ఆకట్టుకునేలా ఉంది. సంగీతభరిత ప్రేమకథా చిత్రమిదని, ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా అలరిస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, రచన-దర్శకత్వం: నవనీత్ శ్రీరామ్.

# భయపెట్టే పంజరం

అనిల్, యువతేజ, ముస్కాన్, రూప ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ థ్రిల్లర్ 'పంజరం'. సాయికృష్ణ దర్శకుడు. ఆర్.రఘన్‌రెడ్డి నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలం. ఈ సినిమాకు పనిచేసిన అందరూ పెద్ద స్టార్స్ అవుతారు. ఈ ప్రయాణానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు' అన్నారు. దర్శకుడు సాయి ఈ సినిమాను గొప్పగా తీశాడని, సినిమా అందరికీ నచ్చుతుందని హీరోలు యువతేజ, అనిల్ అన్నారు. ఈ సినిమాలో భాగం అయినందుకు కథానాయిక రూప ఆనందం వెలిబుచ్చారు.




# హృద్రోగులకు హెచ్చరిక



అగ్ర నటుడు డా.రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయితేజస్విని ప్రధానపాత్ర పోషించిన హారర్ డ్రామా 'ఎర్రచీర'. సుమన్‌బాబు నటిస్తూ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఎన్.వి.వి.సుబ్బారెడ్డి, సి.హెచ్.సుమన్‌బాబు నిర్మాతలు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయనీ, సర్టిఫికెట్ లభించిందని, ఈ నెల 24న సినిమాను విడుదల చేస్తున్నామని మేకర్స్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. హృద్రోగులు మాత్రం తగు జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే ఈ సినిమా చూడాలని మేకర్స్ కోరారు. డివోషనల్ కంటెంట్ ఉన్న ఈ సినిమాలో ఇంటర్వెల్ బ్యాంగ్, ట్కక్లైమాక్స్ హైలైట్‌గా నిలుస్తాయని వారు తెలిపారు. శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి.శర్మ, సురేశ్ కొండేటి, రఘుబాబు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: గోపి విమల పుత్ర, కెమెరా: చందు, సంగీతం: ప్రమోద్ పులిచర్ల.

# ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా. ఆ ప్రాజెక్ట్‌లో హీరోయిన్ గురించి నిర్మాతలే చెబుతారు' అని వివరించింది.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# ఏరుల్లై పారుతున్న గుడుంబా,



## తండాల్లో నాటుసారా జోరు
## ఎక్కడ ఎక్కడ నల్లబెల్లం నిల్వలు
## నిత్యం వేలల్లో లావాదేవిలు



**సిరోలు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సంతోష్,,**

ప్రత్యేకించి గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించేందుకు పోలీసులం ఎప్పుడు సిద్ధంగానే ఉన్నామని స్టేషన్ పనుల్లో బిజీగా ఉండటం వల్ల ఒక్కొక్కసారి ఆప్కారి వారితోటి వెళ్లలేక పోతున్నామని అన్నారు. నిత్యం పొలం గట్ల కేసులు భార్యాభర్తల కేసులు తల్లిదండ్రులకు అన్నం పెట్టని కేసులు అన్నదమ్ముల పంచాయతీ ఇలాంటి కేసులు రావడంతో విఐపి లు వచ్చినప్పుడు వారి బందోబస్తుకు వెళ్లటం తోటి బిజీగా ఉండటం వలన గుడుంబా సవరాలు పై దృష్టి పెట్టలేకపోయామని అన్నారు.

సిరోలు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ వ్యాపారాలు చేసే వారిపై ఉక్కు పాదం మోపుతామని ఇంతకుముందే హెచ్చరించామని మరల అలాంటి వ్యాపారాలు చేసేవారు దొరికితే మాత్రం కటకటాల వెనక్కి వెళ్ళటం తప్పదని అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అక్రమ వ్యాపారాలు జరుగుతుంటే మాకు తెలియజేయాల్సిందిగా ఆయన ప్రజలను కోరారు. చిన్న వయసులోనే మద్యానికి బానిస యువకులు అర్ధం తరంగా జీవితాన్ని ముగించుకుంటూ ఉన్నారని కన్న తల్లిదండ్రులకు భార్య పిల్లలకు తీరని లోటని అన్నారు. గుడుంబా పై ఎన్నో అవేర్నెస్ ప్రోగ్రాములు చేపట్టామని అయినా కూడా వారు మారకపోవడం వలన బాధ కలుగుతుందని అన్నారు.






తొవ్వ న్యూస్

**ప్రతినిధి, కురవి అక్టోబర్ 9,**

కురవి మండలంలో తండాల్లో నాటు సారా ఏరులై పారుతుంది. తెలంగాణ సర్కారు సారా రహిత రాష్ట్రంగా మార్చాలని దృఢనిశ్చయంతో పనిచేస్తున్న ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల అది ఆచరణకు నోచుకోవడం లేదని చెప్పాలి. ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్న ఎక్కడ నాటు సారా తయారీ ఆగడంలేదు. గిరిజన తండాల్లో గ్రామాల్లో నాటు సారా తయారీ యథేచ్ఛంగా సాగుతుంది. ప్రభుత్వం ఆప్కారి శాఖకు పూర్తి బాధ్యతలు అప్పగించిన సారా తయారీ మాత్రం ఆగట్లేదు. కొద్ది రోజులు స్తబ్దుగా ఉన్న మళ్లీ పుంజుకుంది. గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారాయిని బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినా. మరో పక్క సార తయారీ ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం నల్లబెల్లం. అక్రమ వ్యాపారులు ఆంధ్ర రాష్ట్రం నుంచి నిత్యం మండలానికి నెల లో రెండు లారీల నల్ల బెల్లాన్ని అక్రమార్కులు సప్లై చేస్తున్నట్టు మండల ప్రజలు అనుకుంటున్నారు, పోలీసులు ఎక్కడికక్కడ బెల్లం లారీలను పట్టుకుని కేసులు పెడుతున్న కూడా అక్రమ వ్యాపారులు అడ్డదారుల్లో మండలంలోని గిరిజన ప్రాంతాలకు నల్లబెల్లం చేరవేస్తున్నారు. మండలంలో ఒక్క నెల రోజుల్లో 3. 4 లారీలు నల్లబెల్లం వస్తున్నట్లు పోలీసులకు సమాచారం. బెల్లం ను తరలించే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపించిన అక్రమ రవాణా ఆగటం లేదు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. తండాలకు నిత్యం నల్ల బెల్లం పట్టిక ఆటోల్లో ద్విచక్ర వాహనాలపై రాత్రివేళ, తెల్లవారుజామున సప్లై చేస్తుంటారని తండాలో ప్రజలు అంటున్నారు. ఆంధ్రా లోని పలు ప్రాంతాల నుంచి కూడా నల్లబెల్లం ను చప్పుడు కాకుండా దిగుమతి చేసుకుని మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. జనంలో నాటుసారా తక్కువ రేటు మంచి కిక్కు ఉండటంతో యువకులు ప్రజలు నాటు సారాకు అలవాటు పడటంతో మంచి డిమాండ్ ఉండటంతో వ్యాపారులకు మంచి ఆదాయం వస్తుంది. సారా తయారీదారుల్లో పరివర్తన తీసుకొచ్చి తయారీ అమ్మకాలను అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకున్న తయారీదారులకు ఉపాధి మార్గాలు చూపించిన క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. మొదట్లో ఆప్కారి అధికారులు హడావుడి చేసి తయారీదారుల్లో హడావుడి సృష్టించిన ఆ తర్వాత వదిలీ వేయడంతో తయారీదారులు ఇష్టారాజ్యంగా గుడుంబా ను పెట్టడం ఉధృతం చేశారు. తండాలో గ్రామాల్లో నాటు సారా కు బానిసలై ఎందరో యువకులు అనారోగ్యం పాలై మరణిస్తున్నారు, తల్లిదండ్రులకు కడుపుకోత విధిస్తున్నారు, కొడుకు పెద్దవాడై ముసలితనంలో ఆదుకుంటాడు అని తల్లిదండ్రులు కన్న కలలను గుడుంబా రూపంలో యువకులను చిన్న వయసులోనే యమదూత (యమధర్మరాజు) తీసుకెళుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు ఇతర అధికారులు సమన్వయంతో తండాల్లో పెడుతున్నా నాటుసారా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి నాటు సారా ను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసులు ఆప్కారి అధికారులు తలుచుకుంటే నల్ల బెల్లం రవాణా ఆపలేరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, వారికి నెల నెల జీతం కంటే మామూలే ఎక్కువ వస్తుంటాయని అందుకే వారు అక్రమ వ్యాపారాలపై చూసి చూడనట్లుగా ఉంటారని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం,




**ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్, చిరంజీవి,**

పోలీసులను కలుపుకొని ప్రతి చోట సోదాలు చేస్తూనే ఉన్నాము వేల లీటర్ల బెల్లం పానకం పట్టిక పట్టుకొని ధ్వంసం చేయడం జరుగుతుందని అన్నారు. తండాల్లోనే ఎక్కువగా గుడుంబా కుటీర్ పరిశ్రమలాగా పాతుకుపోయారని వారిపై ఎన్ని కేసులు పెట్టిన మళ్లీ మొదటికే వస్తుందని అన్నారు. కఠిన చర్యలు తీసుకుంటేనే గుడుంబా నిర్మూలన జరుగుతుందని లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదని అన్నారు. సాధ్యమైనంత వరకు మేము మా సిబ్బంది నిర్మూలనకు విశ్వ ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

# సమాచార హక్కు చట్టం ప్రజల హక్కు.

## –తాహశీల్దార్ నాగరాజు

**బయ్యారం,తొవ్వ,అక్టోబర్ 9.**



సమాచార హక్కు చట్టం ప్రజల హక్కు అని, సమాచారం ఏ శాఖ నుండి అయినా తీసుకుని హక్కు ప్రతి వ్యక్తికి ఉందని బయ్యారం మండల తాహశీల్దార్ నాగరాజ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశానుసారం సమాచార హక్కు చట్ట వారోత్సవాల సందర్భంగా రెవిన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేపించారు.మండల తాహశీల్దార్ కార్యాలయంలో గురువారం గ్రామ అధికారులు,ఆర్ ఐ ఇతర రెవిన్యూ సిబ్బందితో సమాచార హక్కు చట్టం,దాని హక్కుల గురించి వివరించారు.సమాచార హక్కు చట్టం వారోత్సవాలు ఈ నెల 5 నుండి 12 వరకు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు.సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి వ్యక్తికి తమకు కావలసిన సమాచారం కొంతకాల పరిమితి వ్యవధిలో తీసుకోవడం జరుగుతుందని,సమాచార హక్కు చట్టం ద్వారా నిక్షిప్తమైన సమాచారం అధికారుల నుండి అందుతుందని తెలిపారు.గతంలో ఈ అవకాశము లేదని,2005 సమాచార హక్కు చట్టం ద్వారా ఇంప్లిమెంట్ చెయ్యడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్,జిపిఓలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో తాటి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

## మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్

నర్సంపేట, అక్టోబర్ 09, తొవ్వ న్యూస్:

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారం గ్రామంలో తాటి చెట్లు నరికిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణంలో సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూమాదారం గ్రామంలో గత 40 సంవత్సరాల నుండి కల్లు వృత్తిపై జీవనాధారం కొనసాగించే వందల కుటుంబాలు ఆ గ్రామంలో గీత కార్మికులు ఉన్నారన్నారు.మాదారం గ్రామంలో ఒక పెద్ద మనిషి పంట పొలాన్ని కొనుగోలు చేసి గత సంవత్సరం కొన్ని తాటి చెట్లను తీసివేయగా గీత కార్మికులు వెళ్లి నిరసన వ్యక్తం చేయగా ఆరోజు ఆపేశారన్నారు. ఈ నెల 8న మరలా వందల తాటి చెట్లను జె.సి.బి లతో కూల్చివేయడం మొదలుపెట్టారన్నారు.గీత కార్మికులకు విషయం తెలిసి అడ్డుకోగా చెట్లను కూల్చడానికి సిద్ధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. చెట్లను నరికి గీత కార్మికులు పొట్ట కొట్టొద్దని వేడుకున్నా ఆపలేదన్నారుజీవనాధారం మొత్తం కళ్ళు వృత్తిపై ఆధారపడి ఉంటున్న గీత కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆబకారిశాఖ అధికారులు స్పందించి గీత కార్మికులకు తగిన న్యాయం చేయాలని, లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్,జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం వీరన్న గౌడ్,సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్, గౌడ సంఘం పట్టణ అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు గౌడ్,కార్యదర్శి మద్దెల శ్రీనివాస్ గౌడ్, తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్,మొగలగానిసురేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్ గౌడ్, జునూరి నరేష్ గౌడ్,డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ గౌడ్,గిరగాని కిరణ్ గౌడ్,రమేష్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజనులపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమే..

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్ము నాగరాజు..

**తొవ్వ ,కేసముద్రం, అక్టోబర్ 09:** బహుజనులపై దాడి చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని కేసముద్రం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము నాగరాజు అన్నారు.గురువారం పత్రికా ప్రకటన విడుదల చేసి ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పైన జరిగిన దాడి అంటే రాజ్యాంగంపై దాడి అని ప్రజాస్వామ్యంపై దాడి అని దేశ దళిత బహుజనులపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమేనని మతోన్మాద విష సంస్కృతితోనే ఇలాంటి భౌతిక దాడులు జరుగుతున్నాయని, ఈ దేశాన్ని మనువాద కోణంలో పరిపాలించే దురుద్దేశంతో కొంతమంది మనువాదులు దళితుల పట్ల చూపే రాజకీయవాదులు చేసే కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనను దళిత, గిరిజన బహుజనులు వెనుకబడిన వర్గాలకు చెందిన మేధావులు ప్రజలు వ్యతిరేకించారని పిలుపునిచ్చారు.




# మోసపూరిత కాంగ్రెస్.. అసత్య ప్రచారాలతో అధికారం..

## రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వం..
## కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ..

### మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్..

**తొవ్వ,కేసముద్రం, అక్టోబర్ 09**

మోసపూరిత కాంగ్రెస్.. అసత్య ప్రచారాలతో అధికారం లోని మానుకోట వచ్చిందని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీలో కాంగ్రెస్ బాకీ కార్డులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు





గడుస్తున్న ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రానున్న ఎన్నికలలో ఓటు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఈ బాకీ కార్డులు చూపించి హామీలు అయ్యాయని నిలదీయాలని పిలుపునిచ్చారు .రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్ మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్ , పార్టీ ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి దుబ్బాక ఎంకన్న ,మాజీ మండల అధ్యక్షుడు మోడం రవీందర్ గౌడ్, ముత్యాలశివకుమార్ ,రడం శీను ,కుమార్, కుమార్ స్వామి తార్ సింగ్, భీమా నాయక్ వంగాల అశోక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడగుట్ట తండాలో పోషణ మాసోత్సవం

**తొవ్వ, కేసముద్రం, అక్టోబర్ 09:**అంగన్వాడి కల్వల క్లస్టర్ లోని పిక్లా తండా శివారు బోడగుట్ట తండా అంగన్వాడి సెంటర్లో గురువారం పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు ఇందులో పోషకాలను అందించే 20 రకాల పిండి వంటలు, కొత్త రకమైన వంటకాలు, అలంకరణ బాగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ ఎస్ ప్రేమ జ్యోతి మాట్లాడుతూ... చిన్నపిల్లలకు ఎలాంటి జంక్ ఫుడ్ ఇవ్వవద్దని, నూనె పదార్థాలు, చక్కెర, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉంచాలన్నారు. గర్భిణీ స్త్రీలు ప్రతినెల పరీక్ష చేయించుకుని తగిన పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బేబీ జన్మిస్తుందని చెప్పారు. పిల్లల పెరుగుదల విషయంలో ఎప్పటికప్పుడు పోషకాహారం అందిస్తూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆహార పదార్థాలను చిరుధాన్యాలతో తయారుచేసి పిల్లలకు అందించారు. హాజరైన వారందరితో పోషకాహారం పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గనె యాదగిరి, కార్యదర్శి ఇ.నివాస్ రెడ్డి, టీచర్ గానె పావన, క్లస్టర్ లోని అంగన్వాడి టీచర్లు జీ.నీల, టి.వాణి, ఈ. జ్యోతి, బి.సునీత, బి. స్వప్న, జి.పద్మ, ఆశ వర్కర్లు ఎం.నాగలక్ష్మి, ఎస్.ఉపేంద్ర, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు.



# ఆరుగ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని నిరసన

**ఖానాపూర్, సెప్టెంబర్ 09, తొవ్వ న్యూస్:**

ఖానాపురం మండలంలో నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం మంగళవారి పేట గ్రామంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని నిరసన తెలియజేసి కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డ బాకీ కార్డులను ప్రజలకు అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పైండ్ల యాదగిరి మాజీ సర్పంచ్ లావుడియా రమేష్ మాజీ ఉపసర్పంచ్ ఉపేందర్ బొల్లు దూదయ్య మండల పార్టీ ఉపాధ్యక్షుడు జలగం బాబు గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడు బొల్లుమురళి గొంది నరసయ్య తాళ్లపల్లి చిన్న కమలాకర్ మాలోతు లింగ నాయక్ గోలి స్వామి మేకల రవి రామ్మూర్తి రేకల రాజు మాజీ గ్రామపార్టీ అధ్యక్షుడు మేకల కేశవులు తాళ్లపల్లి కమలాకర్ మేకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# అడ్వకేట్ కోడిదల సంజయ్ కుమార్ ను పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు



నర్సంపేట, సెప్టెంబర్ 09, తొవ్వ న్యూస్:

గూడూరు మండలం మదనపురం గ్రామంలోని అనారోగ్యంతో మరణించిన అడ్వకేట్ కోడిదల సంజయ్ కుమార్ తండ్రి కోడిదల రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బూర సుమన్ గౌడ్ ప్రముఖ పాత్రికేయులు బుడిగే మల్లేష్,గుగులోతు కిషన్ నాయక్, వల్లభనేనికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వీడి బి ఆర్ ఎస్ లో చేరికలు



**తొవ్వ, దంతాలపల్లి, అక్టోబర్.09**

దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెండ్యాల నరేష్,యూత్ అధ్యక్షుడు యాసాని ప్రశాంత్, వెంకన్న, నర్సయ్యలు కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి డి ఎస్ రెడ్యానాయక్ సమక్షంలో చేరినారు ఇట్టి కార్యక్రమంలో నూకల వెంకటేశ్వర రెడ్డి, నూకల శ్రీనివాస్ రెడ్డి, నూకల గౌతం రెడ్డి, ఓలాద్రి మల్లారెడ్డి, ధర్మవరపు వేణు, వీరబోయిన కిషోర్, సంజీవరావు, వెంకన్న, సోమేశ్, రాము, తదితరులు పాల్గొన్నారు

# బాధితుల కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి,మాజీ ఎంపీపీ తక్కళ్లపెల్లి రవీందర్ రావు

ఖానాపురం అక్టోబర్ 09, తొవ్వ న్యూస్:

ఖానాపురం మండలంలోని రామలింగయ్య పల్లి గ్రామానికి చెందిన పరిటాల రత్తమ్మ అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి వచ్చిన రత్తమ్మను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొడుపుకంటే మధుసూదన్,పల్సస రమేష్,బిక్షం రెడ్డి,బుర్ర సుమన్,ప్రముఖ పాత్రికేయులు బుడిగే మల్లేష్,గుగులోతు కిషన్ నాయక్,వల్లభనేని కిరణ్ పాల్గొన్నారు. ఖానాపూర్ మండలం రాగంపేట గ్రామానికి చెందిన నూనె వెంకన్న రిటైర్డ్ (వీఆర్వో) కుమారుడు డాక్టర్ బాలకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నూనె వెంకన్నను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఖానాపూరం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎడ్ల బిక్షం రెడ్డి తండ్రి నర్సి రెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా బాధితున్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కలపల్లి రవీందర్ రావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పలస రమేష్,పోడుపు గంటి మధు,చాగంటి వెంకటేశ్వర్లు,బూర సుమన్,ప్రముఖ పాత్రికేయులు బుడిగే మల్లేష్, గుగులోతు కిషన్ నాయక్,వల్లభనేని కిరణ్ పాల్గొన్నారు.



# మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధి చెబుతాం ....

**కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేసిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 10:**



మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధి చెబుతమని ప్రజలు ఎదురుచూసున్నారని ఆరు గ్యారెంటీలు ఎక్కడపోయాయని మాజీ మంత్రి దయాకర్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు , గురువారం వర్ధన్నపేట, ఐనవోలు మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత బాకీ కార్డుల పంపిణీ ఈ కార్డులను మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ నాయకులు కలసి ఇంటి ఇంటికి తిరిగి ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీ అసత్యప్రచారాలతో అధికారం లోకి వచ్చి 22 నెలలు అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవటంతో నేడు ప్రజలకి కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేసి రానున్న ఎలక్షన్లో ఓటు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఈ కార్డు చూపించి ఈ హామీలు ఏమయ్యాయి అని నిలదీయాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, పలు గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సీనియర్, నాయకులు, కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు.!


**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 10:**



పాలకుర్తి మండలం లక్ష్మీ నారాయణపురం గ్రామా లకు చెందిన కాంగ్రెస్ పార్టీ 10 మంది నాయకులు ,కార్యకర్తలు , యూత్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం తీరు తో విసుగు చెంది గురువారం పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యకులు , సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో వారు గులాబీ కండువా కప్పుకొని బీఆర్ఎస్ పార్టీలోకి స్వచ్ఛంద చేరారు. ఈ,కార్యక్రమంలో జిల్లా, మండల ఆయా గ్రామాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు యూత్ %డ% సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల నోటిఫికేషన్ నిలుపుదల..!

## ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం




భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 కే, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 196, 197, 198 ల ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘమున కు సంక్రమించిన అధికారాల ద్వారా గ్రామ సర్పంచ్ గ్రామ వార్డు సభ్యుల, మండల పరిషత్ సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు ఎన్నికల నిర్వహణ నియమావళి 2018 లోని ఆరవ నియమావళి ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీ సభ్యులు, సర్పంచ్ పదవుల ఎన్నికల కోసం 29 సెప్టెంబర్ 2025న జారీ చేయబడిన ఎన్నికల నోటిఫికేషన్ జి 761/1 నోటిఫికేషన్ వచ్చేవరకు తక్షణం నిలుపుదల చేయబడినది. ఇందుమూ లముగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 29 సెప్టెంబర్ 2025న ఎన్నికల నోటిఫికేషన్ ఆదర్శ ప్రవర్తన నియమావళి అన్ని ఇతర ప్రక్రియలు, చర్యలు, 9 అక్టోబర్ 2025న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం తదుపరి నోటిఫికేషన్ వచ్చేవరకు ఎన్నికల నోటిఫికేషన్లు నిలిపి వేయబడిందని రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలలో నమోదైన ఓటర్లకు తెలుపనైనద ని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.



# సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ కోసం భవనాలను పరిశీలించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 09:

సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ కోసం భవనాలనుఅడిషనల్ డైరెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపీ డాక్టర్ కడియం కావ్య వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్)





వెల్నెస్ సెంటర్ స్థాపనకు కృషి చేస్తున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గురువారం స్వయంగా క్షేత్రస్థాయిలో భవనాలను పరిశీలించారు. ఇటీవల కలెక్టర్, వరంగల్ మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో పలు భవనాలను పరిశీలించి, ఎంపిక చేసిన భవనాల వివరాలను ఎంపీ డా. కావ్యహైదరాబాదులోని %జ+ూ% అడిషనల్ డైరెక్టర్ రోహిణి తెలియజేస్తూ, సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని సీజీహెచ్ఎస్ డైరెక్టర్‌కి సూచించారు. ఈ క్రమంలో గురువారం సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణి హనుమకొండ చేరుకుని ఎంపీ డా. కడియం కావ్యతో కలిసి పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. హనుమకొండలోని కాజీపేట డివిజన్ మున్సిపల్ కార్యాలయం, దూరదర్శన్ కార్యాలయంతో పాటు వసతి గృహం, వరంగల్ పాత కలెక్టర్ వసతి గృహం, కుడా కార్యాలయాలను సందర్శించి వాటి స్థితిగతులు, సౌకర్యాలు, విస్తీర్ణం వంటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కావ్య అధికారులు, ఇంజనీర్లతో కలిసి సెంటర్‌కు అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. భవనం ఎంపిక ప్రక్రియను తక్షణం పూర్తి చేసి సెంటర్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని CGHS అధికారులకు ఎంపీ డా. కడియం కావ్య సూచించారు. తరువాత హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో పెన్షనర్లు డా. కడియం కావ్యను కలిసి సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ మంజూరుకు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే భవనాల పరిశీలనకు డైరెక్టర్ తో ముందడుగు వేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ డా. అప్పయ్య, %జ+ూ% అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటి వర్సెస్ వరంగల్ మంత్రులు

## కాంగ్రెస్ మంత్రుల్లో అంతర్యుద్ధాలు





**తొవ్వ ,హన్మకొండ ,అక్టోబర్ 09:**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం సమసిపోగానే ఉమ్మడి జిల్లాలో మరో మంత్రుల మధ్య విభేదాలు పొడచూపాయి. జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధిపత్య తీరుపై అదే జిల్లా మంత్రులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని విశ్వసనీయ సమాచారం. ఏకంగా కాంగ్రెస్ అధిష్టానా నికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారని తెలి సింది. రేవంత్ సర్కార్కు ఉమ్మడి కరీంనగర్ మంత్రులవివాదం ముగియగానే మరో జిల్లా పొగ రాజుకోవడం తలనొప్పిగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అదే జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా మంత్రులపై పెత్తనం చెలాయించే ఆధిపత్యం తాజాగా పరా కాష్ఠకు చేరిందని తెలుస్తున్నది. దీనికి మేడారం కేంద్రంగా జరిగే పనులే కేంద్ర బిందువుగా మారాయి. మహిళా మంత్రులైన సీతక్క, కొండా సురేఖ వలం ‘ నిమిత్త మాత్రులేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తేల్చారా? అని జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మేడారం మహాజాతర నేప థ్యంగా జరిగే పనుల విషయంలో మంత్రి పొంగులేటి ఓరుగల్లు అంత





నా ఇష్టం అనే చందాల వ్యవహరిస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి . దీన్నికొతోడు గతంలోకొండ మురళి వర్సెస్ వరంగల్ నాయకుల మధ్య రగడ కు కారణం కూడా పొంగులేటి అని గుసగుసలు వినిపిస్తున్నాయి , . ఇప్పటికే వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఏ ఇద్దరినీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలువనీయకుండా తన ఆధిప త్యాన్ని చెలాయిస్తున్నారనే ఆరోపణలు

న్నాయి. పొంగులేటి ఆధిపత్యంపై మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఇప్పటికే కాంగ్రెస్‌అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. బహిరంగం గానే మంత్రి పొంగులేటి వ్యవహారంపై పలు సందర్భాల్లో ఆయన వ్యాఖ్యానించిన దాఖ

ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి అనే అవకాశం, జిల్లాలో కొంత వ ం ం ది ప్రజాప్రతినిధులను త వం వా ళ్ళ గా మలుచుకొని రాజకీయాలు చేయడమే కాకుండా, ఆఖరికి మేడారం జాతర నిర్మా ణాలపై సమీక్షల మీద సమీక్షలు నిర్వహిసున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవన్నీ ఒక ఎత్తు అయితే, తాజాగా

మేడారం పనుల టెండర్ల ముసుగులో తన సంబంధీ

కులకు, తన జిల్లా వారికి పనులను కట్టబె డుతున్నారనే ఆరోపణలువచ్చాయి. ఆ ఆరోపణలకు బలం చేకూరేలా పనుల కోసం టెండర్లకు వచ్చిన మూడు కంపెనీల్లో రెండు మంత్రి పొంగులేటి సన్ని హితులవని, ఒకటి ఇతరులదికావడంతోనే ఆ మంత్రులను దూరం పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ మంత్రి శాఖలో పొంగులేటి పెత్తనం? బీసీ సామాజికవర్గం, మహిళా మంత్రి అయిన కొండా సురేఖ ప్రాతినిధ్యం వహి స్తున్న దేవాదాయ శాఖలో మంత్రి పొంగు లేటి పెత్తనం ఏమిటి? అని ఆమెతో సహా పలువురు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. తన మంత్రిత్వ శాఖలో తనకు తెలియకుండా టెండర్లు పిలవడం ఎంతవరకు న్యాయమని, ఈ విషయంలో ఆమె అధిష్టానానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్టు ఆమె సన్నిహితవర్గాల ద్వారా తెలిసింది. మాటిమాటికీ ఆడబిడ్డలు అంటూ తమను సంబోధిస్తూనే తమపైనే ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారని ఆమెతన సన్నిహితులతో వాపోయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మేడారం పనులకు టెండర్లు పిలవడం, ‘ముఖ్య’ నేత ప్రధాన సలహామండలి బాధ్యులు, ఉమ్మడి వరంగల్జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యేవ్యాపార

